శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# టెక్నాలజీతో నాణ్యమైన వైద్యసేవలు

**- వందల కిలోమీటర్ల దూరం నుంచి అందుబాటులోకి స్పెషలిస్టుల సేవలు**

**- దేశంలోనే తొలి టెలి-రోబోటిక్ సర్జరీ చేసిన నారాయణ, జీఎస్ఎల్ ఆసుపత్రులకు సీఎం అభినందన**



**నెల్లూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త-వైద్యం** టెక్నాలజీని సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును నారాయణ మెడికల్ కాలేజీ ఆసుపత్రులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ ఆసుపత్రుల యాజమాన్యాలకుచెందిన ప్రతినిధులు కలిశారు. ఇటీవల తమ రెండు ఆసుపత్రులు కలిసి టెలి రోటోటిక్ సర్జరీ నిర్వహించినట్లు సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. టెలి రోటోటిక్ సర్జరీ జరిగిన తీరును ఆయా మెడికల్ సంస్థల యాజమన్యాలకు చెందిన ప్రతినిధులు, సింధూర, గన్ని భాస్కరరావు సీఎంకు వివరించారు. నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌లో ఉన్న రోగికి రాజమహేంద్రవరం జీఎస్ఎల్‌లో ఉన్న రోగికి నారాయణ ఆసుపత్రి వైద్యులు దూరం నుంచే శస్త్ర చికిత్స నిర్వహించారని తెలిపారు. దేశంలోనే తొలిసారి ఈ తరహా సర్జరీ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు ఆసుపత్రుల యాజమాన్యాలను సీఎం చంద్రబాబు అభినందించారు. టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే దూరంగా ఉన్నా సరే నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని ఈ సంస్థలు నిరూపించాయని సీఎం అన్నారు. రెండు రోజుల వ్యవధిలో నాలుగు సర్జరీలను విజయవంతంగా పూర్తి చేయడం విశేషమన్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న రోగులకు కూడా ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించిన డాక్టర్లు ఎక్కడి నుంచైనా సర్జరీ చేయగలిగే ఈ సాంకేతికత భవిష్యత్తులో వైద్య సేవల రూపురేఖలను పూర్తిగా మార్చేస్తుందని సీఎం పేర్కొన్నారు.

# తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న వీపీఆర్ దంపతులు



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు సోమవారం తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవలో పాల్గొనేందుకు వచ్చిన వేమిరెడ్డి దంపతులను ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పడింతులు వేదాశీర్వచనం అందించగా అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆ తిరుమల శ్రీవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు.

# వేసవిని దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



**బుచ్చి ఏప్రిల్ 27 ప్రభాతవార్త** రోజురోజుకి వేసవి తీవ్రత ఎక్కువంగా ఉంది నాయకులు,అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎక్కడ త్రాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు ప్రస్తుతం వేసవిలో మూడు సమస్యలు కీలకమని చెప్పారు. వాటి త్రాగునీరు,రెండు విద్యుత్,మూడవది శానిటేషన్ ఈ మూడింటిపైన అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎక్కడ త్రాగునీటి సమస్య వచ్చినా వెంటనే నాయకులు,అధికారులు స్పందించి తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని తరలించాలని ఆమె సూచించారు. అలాగే ఆర్‌డబ్ల్యూస్ అధికారులు స్పందించి పైపులైన్లు మరమ్మత్తులు చేసి నీటి ఎద్దడి నివారించాలని సూచించారు. బుచ్చి మండలంలో హ్యాబిటేషన్స్ ఎక్కువ, పిల్లలకు,పెద్దలకు జ్వరాలు ఎక్కువగా ఉంటాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద ప్రజల పక్షపతి అని ఆయన పేద ప్రజలకోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె సూచించారు. జిల్లాలో డిజల్, పెట్రోల్ కొరత లేదు ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానిని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు.ఈకార్యక్రమంలో ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు ,బుచ్చిరెడ్డిపాళెం బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, ఎంపిడిఒ రంతు్లయ్య, పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి శేషయ్య, నీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణా, కావలి వెంకటేశ్వర్లు,దుగ్గిశెట్టి హరినాద్, మాజీ సర్పంచ్ పెంచలయ్య,జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, రేబాల నారాయకులు నీటి సంఘం అధ్యక్షులు రమణారెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం కమీషనర్ చిన్నబాబు, పలువురు నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిపాదనలు సరే - పరిహారం ఎప్పుడిస్తారు

**- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి**



**ఆత్మకూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** గత నెలలో కురిసిన వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లింపులోప్రభుత్వం ఆలస్యం చేయడంపై మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ నెలరోజులు గడిచినా పరిహారం అందించడంలో అధికారులు ముందడుగు వేయకపోవడం బాధాకరమని విమర్శించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి, రాపూరు, సీతారామపురం మండలాల్లోని 21గ్రామాల్లో మొత్తం 1469 మంది రైతులు 1289 హెక్టార్లలో పంటనష్టం చవిచూసినట్లు అధికారులు అంచనాలు వెల్లడించారన్నారు. ప్రత్యేకంగా అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి, కామిరెడ్డిపాడు, మంగుపల్లి, గోవిందంపల్లి, కమ్మవారిపల్లి, పాతాళపల్లి గ్రామాల్లో వరి, పత్తిరైతులు ఎక్కువగా నష్టపోయారన్నారు. అధికారిక లెక్కల ప్రకారం సుమారు 950మంది రైతులకు చెందిన 2670 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు గుర్తించారన్నారు. నష్టాల అంచనాలు రెండురోజుల్లో పూర్తిచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు, రైతులకు పరిహారం చెల్లింపులో మాత్రం అదే వేగం చూపకపోవడం దురదృష్టకరమన్నారు.పంటకోత దశలోనష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌ప్రారంభానికి ముందే నష్టపరిహారం అందజేస్తే రైతులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పరిహారం విడుదల చేయాలని మేకపాటి విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# ఆటిజం అవగాహన సంబంధించిన ప్లాష్ మాబ్ కార్యక్రమం



**నెల్లూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త-వైద్యం** ఆటిజం అవగాహన నెలలో భాగంగా దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి పునరావాస, సాధికారత సంయుక్త ప్రాంతీయ కేంద్రం నెల్లూరు వారు స్థానిక నెల్లూరు నగరంలోని ఎంజీబి మాల్ నందు ఆటిజం అవగాహన సంబంధించిన ప్లాష్ మాబ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిధులుగా కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం, ఎంజీబీ మాల్ యాజమాన్యం విచ్చేశారు. ఈ ప్లాష్ మాబ్ కార్యక్రమంలో దాదాపుగా 40 మంది విద్యార్థులు, దివ్యాంగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు తరుపున డాక్టర్ మురార్జి పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్, డాక్టర్ వెంకట్ నవీన్ నియోనటాలజిస్ట్, డాక్టర్ ఏ సన్నెన్‌రెడ్డి నెఫ్రాలజిస్ట్, డాక్టర్ రోహిణి ప్రియలోక్న, హెడ్, సీఏఓ మొదలగు వారు పాల్గొన్నారు. సీఆర్‌సీ డైరెక్టర్ ఎస్‌పీ మనోజ్ కుమార్ ఆటిజం లక్షణాలు ప్రాముఖ్యత, వాప్తి , నివారణ తదితర వాటి గురించి వివరించారు. కిమ్స్ హాస్పిటల్ వైద్యులు మాట్లాడుతూ ఆటిజం అనేది వ్యాధి కాదు తొలి దశలోనే గుర్తిస్తే తగినటువంటి చికిత్స ద్వారా నయం చేయవచ్చు అని తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. మన కిమ్స్ హాస్పిటల్ నెల్లూరు నందు పురిటి బిడ్డల నుండి 18 సంవత్సరాల పిల్లల వరకు కిమ్స్ కడిల్స్ విభాగం నందు ప్రత్యేకమైనటువంటిచికిత్సలు అందిస్తున్నామని చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు వంటి మహానగరాలకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఎంతో క్లిష్టమైనటువంటి చికిత్సలు కూడా మన కిమ్స్ హాస్పిటల్ నెల్లూరులోని కిమ్స్ కడిల్స్ నందు నయం చేస్తున్నారని మా యొక్క అనుభవజ్ఞులైన వైద్య బృందంచే ఈ చికిత్సలు అందిస్తున్నామని కిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం యాజమాన్యం తెలియజేశారు. ఇందులో విద్యార్థులు, తల్లిదండ్రులు, దివ్యాంగులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**- అన్ని బంకుల్లో సమృద్ధిగా నిల్వలు - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కోవూరు మండల పరిధిలోని జయ పెట్రోల్ బంకును సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**కలెక్టర్ మాట్లాడుతూ** అపోహలు నమ్మి వినియోగదారులు ఒక్కసారిగా రావడం వల్లనే తాత్కాలిక సమస్య ఏర్పడిందన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అసత్య సమాచారాన్ని అపోహలను ప్రజలు నమ్మవద్దని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత లేదని, పుష్కలంగా నిల్వలు ఉన్నాయన్నారు. మన జిల్లాకు కడప, చిత్తూరు, కృష్ణపట్నం పోర్టు ప్రాంతాల నుంచి నిరంతరంగా ఆయిల్ సరఫరా జరుగుతుందన్నారు. ఆయిల్ ట్యాంకర్లు కూడా సాయంత్రం లోగా జిల్లాకు చేరుకుంటాయన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అపోహలకు లోనై అవసరానికి మించి పెట్రోల్ , డీజిల్ నిల్వ చేసుకోవాలనే ఆలోచన వలనే ఈ సమస్య తలెత్తిందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో మొత్తం 243 పెట్రోల్ బంకుల్లో సరిపడా నిల్వలు ఉన్నాయని ప్రతి బంకు వద్ద పరిస్థితిని జిల్లా ఎస్పీ, జేసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ఆయిల్ సమస్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజానీకం ఆందోళన చెందవద్దన్నారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ యాజమాని సుమన్‌తో మాట్లాడి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం బంకుల్లో పెట్రోల్ ఉన్నప్పటికీ ప్రజలు భారీగా రావడం వలన తాత్కాలిక ఒత్తిడి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పౌర సరఫరాల అధికారిణి లీలారాణి, తహసీల్దార్ సుబ్బయ్యలకు పలు సూచనలు చేశారు. పెట్రోల్ బంక్ వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కోవూరు సీఐ వి. సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్సైలు ముత్యాలరావు, ఖదిర్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# త్వరితగతిన అర్జీలు పరిష్కరణకు చర్యలు

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల - పరిష్కార వేదికకు 308 అర్జీలు**



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** ఫిర్యాదు దారులు ఇచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన అర్జీలు పరిష్కారమయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫిర్యాదుదారులకు అసౌకర్యం కలగకుండా చలవ పందిళ్లు వేయడంతో పాటు ప్రత్యేకమైన క్యూలైన్లను ఏర్పాటు చేశారు. తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు డివిజన్ల వారీగా రెవెన్యూ క్లినిక్లను ఏర్పాటు చేసి ఫిర్యాదుల శీఘ్రగతిన పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులు పరిష్కారంలో అలసత్వం వహించరాదని ఫిర్యాదులు పరిష్కారంలో సమస్య ఉత్పన్నమైతే సదరు విషయాలను వివరంగా అర్జీ ధదారునకు తెలియజేయాలన్నారు. అర్జీల స్వీకరణలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ట్రైనీ కలెక్టర్ పవన్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, తెలుగు గంగ ప్రత్యేక అధికారి వంశీకృష్ణ, డిపిఒ వసుమతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్ తదితరులు పాల్గొని అర్జీ దారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన స్వీకరించారు.

**పరిష్కార వేదికకు 308 అర్జీలు** సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 308 అర్జీలు రాగా దాంట్లో రెవెన్యూ 137, మున్సిపల్ శాఖ 30, పోలీస్ శాఖ 20, పంచాయతీ రాజ్ శాఖ 12, తదితర శాఖలు మరిన్ని ఉన్నాయి.

# చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చూపడం సంతృప్తిగా ఉంది

**- జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల**






**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** కావలిలో దశాబ్దాల కాలంగా చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చూపడం మనసుకు సంతృప్తిగా ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల తెలిపారు. స్థానిక వెంగళరావు నగర్‌లో సోమవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించి వారి సన్మానాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంగళరావునగర్ పరిసర ప్రాంతాలలో సుమారు రెండువేల కుటుంబాలకు ఎంతో కొంత మంచి చేశాననే సంతృప్తి కలిగిందని తెలిపారు. ఎమ్మెల్యే దుగమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఈ సమస్యపై ప్రత్యేకంగా చర్చించినప్పుడు 24గంటల్లో పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చానని ఆ మేరకు అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా పనిచేశారని వారికి అభినందనలుత ఎలిపారు. తాను ట్రైనింగ్‌లో ఉన్నప్పుడు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పడం జరిగిందని కలెక్టర్‌గా ఉన్న అవకాశాలను ప్రజల మేలు కోసం వినియోగించాలి అనే మాటలను ఇప్పటికీ గుర్తించుకొని పనిచేస్తున్నానని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న చుక్కల భూముల సమస్యకు సంబంధజంచిన పైల్స్‌ను క్లీయర్ చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారని ఆయన సహకారంతోనే అధికార యంత్రాంగం వేగంగా స్పందించగలిగిందని తెలిపారు. సుమారు రెండువేల కుటుంబాలకు ఈ చుక్కల భూముల సమస్య పరిష్కారంతో మంచి జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో పట్టణం గోల్డెన్ సిటిగా మారుతుందని పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడంతో వచ్చే రెండేళ్ళలో ఊహించని అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్టణం తిరుపతి నగరాల సరసన కావలి కూడా వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇంకా జిల్లాలో చుక్కల భూములు సమస్యలు ఎక్కడైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని రెండు రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దమ్మున్న అధికారులు ఉంటే ఎంతటి సమస్యనైనా పరిస్కరించవచ్చని ఈ సఘటన నిరూపించిందన్నారు. కలెక్టర్ హిమాన్షుశుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లకు కావలి ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సుమారు 190ఎకరాల చుక్కల భూముల సమస్య పరిష్కారంతో వెంగళరావు నగర్ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని ఈ రోజు కావలి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు తమ ఇళ్ళపై హక్కులు లేకండడా పిల్లల చదువులకు రుణాలు పొందలేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఎన్నికల హామీ మేరకు సమస్యను పరిష్కరించి రిజిస్ట్రేటషన్‌కు అవకాశం కల్పించడం ఆనందంగా ఉందని ఇకపై ఈ సర్వే నెంబర్లలోని భూములను పూర్తి హక్కులతో రిజిష్టర్ చేసుకోవచ్చని తెలిపారు. జిల్లా కలెకటర్‌పై తనకు ఎంతో అభిమానం పెరిగిందని తాను ఆయనకు ప్యాన్‌గా మారిపోయానని వ్యాఖ్యానించారు. కావలి అభివృద్ధిపై కలెక్టర్ చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయం అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తుండగా జిల్లా స్థాయిలో కలెకటర్ అదే దిశగా కృషి చేస్తున్నారని తెలపిఆరు. కావలి ప్రజలు శాంతికాముకులని జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతంపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ మరింత కొనసాగాలని కరారు. చుక్కల భూముల సమస్య పరిష్కారంత వెంగళరావు నగర్ ప్రాంతంలోపండగ వాతావరణం నెలకొంది. స్థానిక ప్రజలు అనందం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌ను, జాయింట్ కలెక్టర్‌ను, ఎమ్మెల్యే, కౌన్సిలర్‌లతో కలసి ఘనంగా సత్కరించారు. అనంతరం చుక్కల భూముల సమస్యను పరిష్కరిస్తూ కలెక్టర్ ఇచ్చిన ప్రోసిడింగ్ ఉత్తర్వులు కాఫీలను లబ్దిదారులకు అందజేశారు. ఆర్డీఓ ఎలిషాబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తహశీల్దార్ శ్రావన్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 57.793 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 0 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.678 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు

**- నేడు జిల్లాకు 47 లోడ్ల డీజిల్**

**- జిల్లాకు 148 లోడ్ల డీజిల్ మంజూరు**

**- జిల్లాలో డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయి**

**- ప్రజలు బయాందోళనలు చెందవద్దు**

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** జిల్లాలో డీజిల్ నిల్వలు సమృద్దిగా ఉన్నాయని, ఈ విషయమై ప్రజలు బయాందోళనలు చెందవద్దు అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల విజ్ఞప్తి చేసారు. సోమవారం జిల్లాలో డీజిల్ నిల్వలపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 271 డీజిల్ అవుట్ లెట్లు ఉన్నాయని, వాటిలో 40 షాపులలో కొంత తక్కువనిల్వలు ఉన్నాయన్నారు. ప్రముఖ ఆయిల్ కంపినీలు అయిన ఐ.ఒ.సి.యల్, బి.పి.సి.యల్, అరియు హెచ్.పి.సి.యల్ యాజమాన్యాలవారితో చర్చించడం జరిగిందన్నారు. జిల్లాకు 148 లోడ్ల డీజిల్ మంజూరు కాగా ఈ రోజు సాయంత్రం 5 గంటల లోపు 47 లోడ్ల డీజిల్ జిల్లాకు చ్చేరుకొంతుందని అన్నారు. రవాణా విషయములో జాప్య నివారణకై జిల్లా యస్.పితో చర్చించడం జరిగిందని తెలిపారు. జిల్లాకు ముఖ్యంగా 3 ప్రాంతాలు నుండి అనగా కృష్ణ పట్నం పోర్టు, కడప మరియు చిత్తూరు నుండి డీజిల్ అందుతుంది అని అన్నారు. ఈ విషయమై ప్రజాలు బయాదోళనలు చెందవద్దని, జిల్లా సమృద్ధిగా నిల్వలు ఉన్నాయన్నారు. డిజిల్ ఆయిల్ నల్ల బజారు లో అమ్మినా లేదా నిబందనలు పాటించని వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయాన తెలిపారు. వారి సాగు, రొయ్యల సాగుకు సరిపడా డీజిల్ అందించడం జరుగుతుందని దాని కొరకై ప్రతి షాపు దగ్గర ఒక వి.ఆర్.ఓ, హోం గార్డును తగు ఆధార్ కార్డులు పరిశీలనకై ఉంచడం జరిగిందని తెలిపారు.

# పెట్రోల్ కొరత లేదు వదంతులు నమ్మవద్దు



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త** కోవూరు శివార్లలో జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంక్ ఆకస్మిక తనిఖీ. సిఎం చంద్రబాబు నాయుడు జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఇంధన సరఫరాలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పర్యవేక్షి స్తున్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి. పెట్రోల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి చేశారు. కోవూరు శివార్లలోని జాతీయ రహదారిపై గల చౌదరి పెట్రోల్ బంకును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఉన్న నిల్వలను మరియు రికార్డులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్రోల్ కొరత ఉందని వస్తున్న వార్తల్లో ఎటువంటి నిజం లేదని కేవలం కొందరు కావాలనే ఇటువంటి వదంతులను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు భయంతో ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్దకు రావడంతో రోజువారీ కంటే రెట్టింపు వ్యాపారం జరుగుతోందని అనవసరపు రద్దీ వల్ల సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఇంధన సరఫరాలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పర్యవేక్షి స్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పెట్రోల్ మరియు డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రజలు బంకుల వద్ద గంటల తరబడి బారులు తీరి కంగారు పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని ఆమె ప్రజలకు ధైర్యం చెప్పారు.

# పెళ్ళి కోడుకుగా ముస్తాబై కోనకు పల్లకీలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుడు

**- స్వామి వెంట కాలినడకన కోనకు వేలాదిమంది భక్తులు**

**- బోయిల గోవింద నామస్మరణలతో కాలినడకన కోనకు**

**- కోనలో బ్రహ్మోత్సవాల శోభ**

**- ఆలయ ముఖద్వారం వద్ద స్వాగతం పలికిన అర్చకులు**





**రాపూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారు బ్రహ్మోత్సవాలకు పెళ్ళి కోడుకుగా ముస్తాబై ఉభయ నాంచారులతో కలిసి సోమవారం గోనుపల్లి గ్రామం నుండి పెంచలకోనకు పల్లకీలో బయలుదేరి వెల్లారు. ఈ సందర్భంగా గోనుపల్లి గ్రామంలో పండుగ వాతావరణం నెలకోంది. బ్రహ్మోత్సవాలకు ఉభయ దేవేరులతో పల్లకిలో కోనకు బయలుదేరిన స్వామి వారికి గోనుపల్లి గ్రామస్తులు వారి నివాసాల ముందుబాగాన చలువ పందిళ్ళు ఏర్పాటు చేసి స్వాగతం పలికి మొక్కులు చెల్లించారు. స్వామి వారు గ్రామ గిరిజన కాలనీ వద్దకు చేరుకోగానే గిరిజనులు వారి సాంప్రదాయం ప్రకారం ఇంటి అల్లుడైన పెంచల స్వామికి గిరిజన సాంప్రదాయం ప్రకారం పుట్టతేనే, ఇంజేటి గడ్డలు, ఇతర దుంపలు, అరినార మొలతాడు వంటి వాటిని నైవేద్యంగా సమర్పించారు. అక్కడి నుండి బయలు దేరిన స్వామి వారు గోల్లబోయిన స్వామి వారి ఆలయం వద్దకు చేరుకోగానే గోల్లబోయిన స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తోలి దర్శనం గోల్లబోయిన స్వామి వారికి ఇచ్చారు. అక్కడి నుండి సుమారు 6 కిలోమీటర్ల మేర స్వామి వారిని బోయిలు గోవింద నామస్మరణలతో పల్లకీలో మోసుకుంటూ కోనకు చేరుకున్నారు. కోనలోని స్వామి వారి ముఖద్వారం వద్దకు స్వామి వారు చెరుకున్నంతనే అర్చక స్వాములు అక్కడికి చేరుకోని స్వామి వారికి పూజలు నిర్వహించి ఆహ్వానం పలికారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ సతీమణి కురుగొండ్ల సిందు, సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, ఆలయ ఇన్‌చార్జ్ డిప్యూటీ కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, పీర్ల సోమయ్య, బోట్ల పూజిత, శ్రీశైలం భార్గవ రామ్, తోట ఉమా, మోదేపల్లి ఇందిర, చీర్ల వెంకటేశ్వర్లు, కిన్నెర నరసింహా రావు, పెమ్మసాని సుగుణమ్మ, మొమిడి దేవిక, ఈతముక్కుల సుగుణమ్మ, బోగోలు బాస్కర రెడ్డి, బోంతల పుష్పలత, తురిమెర్ల పెంచలయ్య, ఏకసిరి అంకమ్మ, పెద్ద ఎత్తున భక్తులు వున్నారు.

**స్వామి వెంట కాలినడకన వేలాదిమంది భక్తులు కోనకు :** బ్రహ్మోత్సవాలకు కాలినడకన పల్లకీలో కోనకు బయలుదేరిన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహా స్వామి వారి వెంట ఈ పర్యాయం గతంలో ఎన్నడూ లేని విధంగా వేలాధి మంది భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ కాలినడకన కోనకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం,చెక్క భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# డయల్ యువర్ ఎస్.ఈ. కార్యక్రమానికి 3 ఫిర్యాదులు



**నెల్లూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త-వైద్యం** ఈ రోజు విద్యుత్ భవన్, నెల్లూరు నందు నిర్వహించిన డయల్ యువర్ ఎస్.ఈ." కార్యక్రమానికి జిల్లాలోని అన్ని డివిజన్ల నుండి మొత్తం 3 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం తెలిపారు. ఈ ఫిర్యాదులు ముఖ్యంగా కండక్టర్ రీప్లేస్ మెంట్, లో వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయం పై ముందస్తు సమాచారం తదితర అంశాలకు సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. అందిన ప్రతి ఫిర్యాదును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని, వాటిని సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లకు వెంటనే తెలియజేసి, రెక్టిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం తిరిగి ఫోటోతో సహా నివేదిక పంపించాలని ఆదేశించామని తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం ఈ డయల్ యువర్ ఎస్.ఈ. కార్యక్రమం నిర్వహించబడుతున్నదని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్) ఎస్. బాల చంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కమర్షియల్ మునీంద్ర,అసిస్టెంట్ ఇంజనీర్లు నరసింహారావు, తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## మూతపడ్డ ఎరువుల డిపోలు

**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ఎరవుల దుకాణాలు సోమవారం నిరవధిక బంద్ పాటించాయి. మహారాష్ట్రలో ఇన్‌పుట్ డీలర్స్ అసోసియేషన్ సమ్మె చేస్తున్నారు. దీనికి మద్దతుగా కోవూరు మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలు సోమవారం పూర్తిస్థాయిలో మూసివేసి బంద్ చేపట్టారు. దీంతో ఎరువుల కోసం రైతులు ఇబ్బందులకు గురయ్యారు.



## సదరంకు వచ్చే వారు అన్ని పత్రాలతో హాజరు కావాలి

**కోవూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరంకు వచ్చే ప్రతి ఒక్కరూ నిర్దేశించిన ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని డాక్టర్ అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సదరంకు వచ్చిన వారిని నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిర్దేశించిన ధృవీకరణ పత్రాలతో వస్తేనే సులువుగా వారికి సేవలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 21 మందికి సదరం పరీక్షలు నిర్వహించారు.



## కోనలో స్వామి,అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం





**రాపూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో బాగంగా తొలిరోజైన సోమవారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసిం హస్వామికి, ఉభయ దేవేరులతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం(అభిషేకం),శాస్త్రోక్తంగ నిర్వహించారు. ఇందులో బాగంగా స్వామి ఆరి ఆస్థాన మండపంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పాలు,పెరుగు, నెయ్యి, తేనే, పంచదార వంటి పంచామృతాలతో పాటు, పలు రకాలైన పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం(అభిషేకం), శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అభిషేకాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సతీమణి సింధు , బ్రహ్మోత్సవాల సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, పలువురు సేవా కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య యాదవ్, ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి,ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ,ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి,పెంచల పెంచలయ్య స్వామి,తిరుమల వేద పాఠశాల పంచారాత్ర ఆగమపండితుడు రామానుజాచార్యులు,ముఖ్య అర్చక స్వామి,గుండ్లూరు శశి స్వామి,వినోద్ స్వామి, తదితరులున్నారు.ఈ అభిషేక కార్యక్రమానికి ఉభయకర్తలుగా నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, ఆలయ ఫెస్టివల్ కమిటీ భాధ్యుడు చెన్ను తిరిపాల్ రెడ్డి, రాపూరు సోసైటీ మాజీ అధ్యక్షుడు చెన్ను బాస్కర రెడ్డి,రాపూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డిలు వ్యవహరించారు.

## హరికి ఆల్ ఇండియా అవార్డు

**వెంకటాచలం ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** శివాజీ యూత్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ ఎంపులూరు హరికి ఆల్ ఇండియా సుమన్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన టౌన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో సుమన్ చేతుల మీదుగా హరి అవార్డు అందుకున్నారు. గత 25 సంవత్సరాలుగా శివాజీ యూత్ ఫౌండేషన్ లో సామాజిక సేవలు చేస్తున్న సందర్భంగా ఈ అవార్డు ప్రధానం చేశారు. శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఇతర జిల్లాలో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల నుంచి మన్నలు పొందారు. హరి కి అవార్డు రావడంతో శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ నాయుడు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 25 గౌరు సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, సుమన్ యువసేన అధ్యక్షులు రషీద్ తదితరులు పాల్గొన్నారు.



## వేదగిరిపై వైభవంగా ధ్వజారోహణ

**నెల్లూరు అగ్రికల్చర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండపై వెలసియున్న శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండవ రోజైన సోమవారం ఉదయం చప్పర ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మనుమల్లు శ్రీ సాయి హర్షిత, రమేష్, మేతిల్ రమేష్, కార్తీక్ వెంకటేష్ తదితరులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అదే విధంగా రాత్రి ధ్వజారోహణ కార్యక్రమానికి వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సోమిశెట్టి వెంకట సుబ్బయ్య ఉభయకర్తగా వ్యవహరించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో వేమూరి గోపి, పాలకమండలి సభ్యులు భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు. స్వామివారి ఉత్సవాలను తిలకించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు. మము కరుణించి కాపాడు స్వామి అంటూ వేడుకున్నారు.



## ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్

**గూడూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ఆదిశంకర యూనివర్సిటీ అధ్వర్యంలో విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించారు. గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి పాఠశాలతో పాటు బాలాజీ, స్వర్ణాంధ్ర భారతి కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి ఇంటర్ విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో మొదటి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆదిశంకర యూనివర్సిటీలో ఇంజినీరింగ్‌లో నూరు శాతం ఫీజు రాయితీ వర్తిస్తుంది. ఈ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ, రామయ్య వెల్లడించారు.



## డీజిల్ లేక ఇబ్బందులు





**దగదర్తి, ఏప్రిల్ 27,ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతంలో మూడు పెట్రోల్ బంకులు ఉండగా చిన్నారు, ఉలవపాళ్ళ గ్రామంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద రెండు మూడు రోజుల క్రితం నుండి డీజిల్ లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే దగదర్తి గ్రామంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద డీజిల్ పెట్రోల్ యధావిధిగా వాహనదారులకు అందుబాటులో ఉండగా సోమవారం నాడు దూర ప్రాంతాల నుంచి కూడా డీజిల్ కోసం క్యాన్లు తీసుకుని పెట్రోలన బంకు వద్దకు అధిక సంఖ్యలో జనాలు వచ్చి పెట్రోల్ బంకు వద్ద బారులు తీరారు. వచ్చిన జనాలు పెట్రోల్ బంకు వద్ద బారులు తీరారు. వచ్చిన జనాలకు డీజిల్ సరఫరా చేయలేక పెట్రోల్ బంకు మేనేజర్ ఆయిల్ ఇవ్వడం ఆపేశాడు. ఆయిల్ లేదని వచ్చిన వ్యక్తులకు చెప్పడంతో కొంత మంది వ్యక్తులు ఆగ్రహంతో పెట్రోల్ బంకు మేనేజర్‌ను దుర్భాషలాడారు. మేనేజర్ పోలీసు ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు వచ్చి గొడవలు జరగకుండా సమస్యను అదుపులోకి తెచ్చారు. ఆయిల్ బంకు మేనేజర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఆయిల్ కొరత లేదని కాకపోతే సమయానికి మాకు ఆయిల్ చేరటం లేదని అందువల్లనే మేము వచ్చిన వారికి అందించలేకపోతున్నామని వాహనదారులు కూడా ఆయిల్ దొరకదమోనని అపోహతో ఆయిల్ స్టాక్ చేసి పెట్టుకుంటున్నారని అందువల్ల కూడా అందరం ఇబ్బందులు పడుతున్నామని అపోహలు మానాలని ఆయిల్ అందరికి అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు.

## ఉదయగిరిలో పెట్రోల్ బంకులపై నో స్టాక్ బోర్డులు

**ఉదయగిరి, ఏప్రిల్ 27,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని మూడు పెట్రోల్ బంకుల వద్ద సోమవారం వాహనదారులు అలా చూస్తూ ఉండిపోయారు. అనంతరం రెవెన్యూ శాఖ తహసీల్దార్ పోలీసు శాఖ సిబ్బంది పంపులు వద్ద పరిస్థితిని పరిశీలించారు. బైకులకు రూ.వంద, ఆటోలకు రూ.200లకు, కార్లకు రూ.500 చొప్పున పెట్రోల్ డీజిల్ పట్టాలని ఆదేశించారు. దీంతో వాహనదారులు తీవ్ర స్థాయిలో పెట్రోల్ నిర్వాహకులపై మండిపడుతున్నారు.సుదూర ప్రాంతాల కు వెళ్లే వాహనదారులకు ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు. చమురు సంక్షోభం పెట్రోల్ బంకుల వద్ద క్యూలు నో స్టాక్ బోర్డులతో బారులు తీరిన జనం మూడు రోజులు స్టోరేజ్ ఉన్న చోట కేవలం ఒక్క పూట మాత్రమే సేల్స్ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మళ్లీ ట్యాంకర్ వచ్చేంత వరకు తిప్పలు పెట్రోల్ కొత్త లేదని చాలా స్పష్టంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎక్కడ చూసిన పెట్రోల్ కొరత కనిపిస్తూనే ఉంది .ప్రజలు విలవిల్లాడుతున్నారు.



## జిల్లాలో ఉపాధి హామీలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టండి

**– మండల పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతి**

**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో ఉపాధి హామీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపాలని, 2025 డిసెంబర్ నెల నుండి పెండింగ్ లో ఉన్న కూలీల వేతనాల విడుదల చేయాలని మండల పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ జిల్లాలో ఉపాధి హామీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి, పథకం సక్రమంగా జరిగేటట్టుగా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఉపాధి హామీలో క్రింది చర్యలు వెంటనే చేపట్టి కూలీలను ఆదుకోవాలని కోరారు. అందులో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని, పనుల వద్ద నీరు, నీడ, మందుల సౌకర్యం కల్పించాలని, కూలీలు అడిగిన వెంటనే పని కల్పించి వలసలు ఆపాలని, నకిలీ మస్టర్లు అరికట్టి, నిజాయితీగా పనులు జరిగేటట్టుగా చూడాలని,ఉపాధి హామీ పనులలో బయటపడిన అవినీతిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పనులు లేక మల మల లాడుతున్న జిల్లా కూలీలకు సమృద్ధిగా పనులు కల్పించి,పై చర్యలు తీసుకుని, ఉపాధి హామీ పథకాన్ని అన్ని గ్రామాలలో కల్పించి, వలసలను ఆపి జిల్లాను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు నెల్లూరు శివప్రసాద్, కట్ట సుబ్రహ్మణ్యం, పలు గ్రామాల వైసిపి నాయకులు పాల్గొన్నారు.



## ఏఎస్‌పేటలో సర్వసభ్య సమావేశం

**అనుమసముద్రంపేట, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండల సర్వసభ్య సమావేశం సోమవారం మండలాధ్యక్షురాలు పద్మజారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీటి ఎద్దడి నివారణా చర్యలు , ధాన్యం గిట్టుబాటు ధరలు, వైద్యాస్ ఆరోగ్య శాఖ పథకాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఎంపిపి పద్మజారెడ్డి , ఎంపిడిఒ ప్రసన్నకుమారిలు వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తెలత్తకుండా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ ఎఇలు, ఎంఇఒ జ్యోతి, ఎంఇఒ -2 సాయిప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ మునిరత్నం, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు , ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు. సర్పంచ్‌లను సత్కరించిన అధికారులు ఏఎస్‌పేట మండలంలోని పదవీకాలం పూర్తి చేసుకున్న పలువురు సర్పంచ్‌లను సోమవారం ఎంపిపి పద్మజారెడ్డి, ఎంపిడిఒ ప్రసన్నకుమారిలు సత్కరించారు. కుప్పురుపాడు, భీమవరం, దూబగుంట, పొనుగోలు సర్పంచ్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




## శిధిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం

**వింజమూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** వింజమూరు కొత్తూరు నందిలి ప్రధాన రహదారిలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం శిధిలావస్థకు చేరి పడిపోయే దశలో ఉంది. దానికి ఆధారంగా వేసిన మరో స్తంభం కూడా అలాంటి పరిస్థితుల్లోనే ఉంది. పొరపాటున అది కూలినట్లయితే ప్రాణప్రమాదములు జరిగే అవకాశం ఉంది. జరిగిన తర్వాత ఎంత పరిశీలించిన ఏం చేసినా ఫలితం శూన్యం అవుతుంది. కాబట్టి సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఆ స్తంభాలను పరిశీలించి వాటి స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత స్థానికులు కోరుతున్నారు.



## సమస్యలు చెప్పండి.. పరిష్కారం మాబాధ్యత: తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి

**కొడవలూరు,ఏప్రిల్ 27ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ వేదికను ఏర్పాటు చేసిందని తెలిపారు. భూ సంబంధిత అంశాలపై వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ప్రజా వేదికలో వచ్చిన ప్రతి అర్జీని ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, కొంతమంది సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామని తెలిపారు. మిగిలిన వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఏఎస్ఓ గాయత్రి, ఆర్ఐ హైమావతి, ఏపిఎం కృష్ణవేణి, మండల విద్యాశాఖ అధికారి వసంతకుమారి, వీఆర్వోలు మరియు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రక్షణలేని బావి.. పిల్లల ప్రాణాలకుముప్పు: రైల్వే గేటు కాలనీలోనిరక్ష్యం

**కొడవలూరు,ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రైల్వే గేటు కాలనీలో ఉన్న పాత బావి ప్రమాదకరంగా మారింది. ఎలాంటి రక్షణ గోడలు, కంచె లేకుండా నిరక్ష్యంగా వదిలిపెట్టిన ఈ బావి చుట్టూ చిన్న పిల్లలు తరచూ ఆడుకుంటూ కనిపిస్తున్నారు. బావి గోడలు పగిలిపోయి బలహీనంగా ఉండటంతో ఎప్పుడైనా కూలిపోవచ్చని, ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి సాయంత్రం సమయాల్లో పిల్లలు ఎక్కువగా బావి దగ్గరే గడుపుతున్నారని, ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేదా రక్షణ చర్యలు లేకపోవడం వల్ల ప్రమాదం మరింత పెరిగిందని కాలనీవాసులు చెబుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బావికి రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైతే మూత వేసి ప్రమాదాన్ని నివారించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.



## పెట్రోల్ డీజల్ కృత్రిమ కొరతను నివారించాలి

**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో నెలకొన్న పెట్రోల్, డీజల్ కొరతను నివారించి కృత్రిమ కొరత సృష్టిస్తున్న పెట్రలోల్ బంకుల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక బిజెపి నాయకులు డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం బిజెపి నాయకులు కావలి ఆర్డీఓ ఎలిషాకి వినతిపత్రం అందజేశారు. అనంతరం బిజెపి సీనియర్ నాయకులు, జిల్లా టెఇకాం అడ్వైజరీ కమిటీ సభ్యులు కుట్టిపోయిన బ్రహ్మానందం మాట్లాడారు. మార్కెట్‌లో ఇంధన సరఫరా సాధారణంగానే ఉన్నప్పటికి, కొన్న బంకుల యాజాన్యాలు కావాలనే నోస్టాక్ బోర్డులు పెట్టి అక్రమ నిల్వలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఇందనం దొరకక పోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు సామాన్య ప్రజలు గంటల తరబడి బంకుల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని అవేదన వ్యక్తం చేశారు. డీజల్ దొరకకపోవడం వలల రైతులు ట్రాక్టర్లు, యంత్రాలు నడపలేక తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఆర్డీఓ వెంటనే స్పందించి పెట్రోల్ బంకుల్లో స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేయాలని నిబంధనలు ఉల్లంఘిచే బంకుల లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే బ్లాక్ మార్కెట్ దందా సాగుతుందని సామాన్యుల అవసరాలను అసరాగా చేసుకొని దోపిడికి పాల్పడితే సహించేది లేదన్నారు. తక్షణమే నిరంతరాయంగా ఇందన సరఫరా జరిగేలా చూడాలని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ స్పందించి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బంకుల్లో తనిఖీలు నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఒకటవ పట్టణ అధ్యక్షులు మందకిరణ్‌కుమార్, బిజెవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి దేవాండ్ల రాకేష్, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## గోవదను దేశవ్యాప్తంగా పూర్తిగా నిషేదించాలి

**సంగం ఏప్రిల్ 28 ప్రభాతవార్త** సంగంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో తహసిల్దారు కార్యా లయంలో వినతి పత్ర సమర్పించారు. గోవదను దేశవ్యాప్తంగా పూర్తిగా నిషేదించాలని,ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. డిప్యూటి తహసిల్దారు బ్రహ్మయకు హిం దూ చైతన్య వేదిక సభ్యులువినతి పత్రం సమర్పి ంచారు. అలాగే గోవదరకు పాలుపడే వారిపైన కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.



## ట్రాఫిక్ నిబంధన పై విద్యార్థులకు అవగాహన సదస్సు

**వెంకటాచలం ఏప్రిల్ 27 ప్రభాత్‌వార్త :** ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో సౌత్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ రెడ్డి నిర్వహించారు. మండల పరిధిలోని అక్షరావిద్యాలయంలో విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన నిర్వహించారు. విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని లేనిపక్షంలో ప్రమాదాలను బారినబడే అనేకమంది మృత్యువాత పడుతున్నారు అన్నారు. అతివేగం ఎలిమెంట్ లేకుండా ప్రయాణం చేయటం వల్ల అనేక మంది దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు.



## పెట్రోల్ బంక్ తనిఖీలు నిర్వహించిన తహసిల్దార్

**కొడవలూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని బోడువారిపాలెం గ్రామంలో ఉన్న శ్రీనివాస ఐఒసీఎల్ పెట్రోల్ బంక్‌ను స్థానిక తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి సోమవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బంక్‌లో నిల్వ ఉన్న ఇంధనాన్ని పరిశీలించి, డీజిల్ 500 వందల లీటర్లు, పెట్రోల్ సుమారు 3 వేల లీటర్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 8 పెట్రోల్ బంకులు ఉండగా, అన్ని చోట్ల సరఫరా సజావుగా కొనసాగుతోందన్నారు.ఇంధన కొరతపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు చర్యలు తీసుకు ంటున్నామని తహసిల్దార్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా నిల్వ చేయడం లేదా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ సిబ్బంది, వీఆర్‌వోలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. అవసరమైన చోట అదనపు ఏర్పాట్లు కూడా చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్‌వో సురేష్ తదితరులు పాల్గొన్నారు



## లేఔట్ యజమాని పై చర్యలు తీసుకోండి

**– కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**

**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నాలుగో మైలు నవలాకుల తోట దోసకాయల దిబ్బ దగ్గర కొత్తగా వేసిన లేఔట్‌లో అక్కడ ఇల్లు కొన్న బాధితులు తాము మోసపోయామని జిల్లా కలెక్టర్ వద్ద వచ్చి వాపోయారు సోమవారం బాధితులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో పాటు నవ్వులాకుల తోట తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎండి జావిద్‌తో వచ్చి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసారు. సబ్ రిజిస్టర్ ఆఫీస్ నెల్లూరు కార్యాలయం ద్వారా సర్వేనెంబర్ 207/2, కల ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా బిల్డింగ్స్ పర్మిషన్ తీసుకొని ప్రభుత్వం భూమిలో అక్రమంగా భవనాలు నిర్మించి ప్రభుత్వ భూమిలో అక్రమంగా భవనాలు నిర్మించి సర్వేనెంబర్ సర్వే నెంబర్ 207/2 బదులుగా 207/1ఏ, సర్వే నెంబర్‌తో డాక్యుమెంట్స్ సృష్టించి ఎస్ ఆర్ ఓ మోసగించి రిజిస్ట్ చేయించి భూమి, బిల్డింగును అమ్మడం కొరకు లేవుట్ ఓనర్ పొలం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి మరియు ఇద్దరు బిల్డర్లు భాగ్యస్వాములై అమాయక జనాలని మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వీరిపై కఠిన చర్యలు జిల్లా కలెక్టర్‌కు బాధితుల పక్షాన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు ఎండి జావిద్ కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం

**– జిల్లా ఎస్పి డా. అజిత వేజెండ్ల**

**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** వినతులు పునరావృతం కాకుండా, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పి, ఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 149 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ప్రదర్శించరాదని, ప్రజలతో జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. మనుబోలు శిశీకు చెందిన మహిళా, తన భర్త అత్తఇంటి వారు అదనపు కట్నం కోసం తనను శారీరకంగా మానసికంగా వేదిస్తునట్టు, తనని ఇంటినుంచి గెంటివేసినట్టు విచారించి వారిపై తగిన చర్యలు తీసుకోవలని ఫిర్యాదు చేశారు. కావలి 2 టౌన్ పిఎస్‌కు చెందిన మహిళా, తన ఇంటిలో గత సెప్టెంబర్ నెలలో దొంగతనం జరిగినట్టు, బంగారం వెండి దొంగిలించినట్టు కావలి 2టౌన్ పిఎస్‌లో కేసు నమోదైనట్టు, కేసు ని విచారించి చోరి సొత్తుని రికవరీ చేయమని కోరారు. అల్లూరుకు చెందిన మహిళ, తన భర్తతో విడాకులు పొంది ఉండగా అదేప్రాంతానికి చెందిన మోడెం అనిల్ కుమార్, సుకుమార్ అనే ఇద్దరు చెడు ఉద్దేశ్యంతో వేదిస్తున్నట్టు, తమ మాట వినకపోతే తన వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో ఉంచుతామని విచరించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా స్టేషన్ డీఎస్పీ యు. సత్యనారాయణ, డిటిసి డిఎస్పీ గిరిధర్ కావలి డిఎస్పి వివి.రమణ కుమార్, మహిళా స్టేషన్ సిఐ సుబ్బారావు, కంట్రోల్ రూమ్ సిఐ భక్తవత్సల్ రెడ్డి, ఎస్‌బి2 సిఐ శ్రీనివాస రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



## జొన్నవాడ అర్చ్ వద్ద రోడ్డు ప్రమాదం - యువకుడి దుర్మరణం

**నెల్లూరు క్రైం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ మండలం జొన్నవాడ ఆర్చి సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండ్లపూడి గ్రామానికి చెందిన పుట్టా సునీల్ (30) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం సునీల్ తన మోటార్ సైకిల్ (ఏపి 39 ఎంవై 9886) పై కొండ్లపూడి నుండి బుచ్చి వైపు వెళ్తుండగా, దేవరపాళెం నుండి నెల్లూరు వైపు వస్తున్న బోలేరో ట్రక్కు (ఏపి 37 టిడి 3132) అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి జొన్నవాడ అర్చ్ వద్ద బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సునీల్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని శోకసంద్రంలో మునిగిపోయారు. తండ్రి పుట్టా వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## కావలి డివిజన్‌లో ఇందన సరఫరా పంపిణీపై పర్యవేక్షణ కావలి ఆర్డీఓ ఎలీషా

**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** కావలి డివిజన్ పరిధిలోని ఇంధనం సరఫరా పంపిణీపై పర్యవేక్షణ చేపట్టడం జరుగుతుందని కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎలీషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలియజేస్తూ ఇంధన సరఫరా పంపిణి దృష్టిలో పెట్టుకొని డివిజన్ పరిధిలోని అన్ని మండలాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి పెట్రోల్ బంక్ వద్ద ఒక విఆర్‌ఓని ఒక కానిస్టేబుల్‌ని నియమించడం జరిగిందన్నారు. ఇంధన సరఫరా నిల్వలు పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలో తగినంత ఇంధన నిలువలు అందుబాటులో ఉన్నాయని సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని తెలిపారు. కొన్ని ప్రాంతాలలో తాత్కాలిక ఇబ్బందులు అధిక డిమాండ్ కారణగా ఏర్పడుతుందన్నారు. ప్రజలు వదంతులు నమ్మకుండా అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేయకుండా సహకరించాలన్నారు. పెట్రోల్ బంకు వద్ద స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు పారదర్శకతను పాటించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లయితే సమీప పోలీస్‌స్టేషన్‌లో కాని సంబంధిత రెవెన్యూ అధికారులుకు తెలియపరచాలన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళలను చెందాల్సిన అవసరం లేదని ప్రస్తుత పరిస్థితిని పూర్తిగా సాదారణ పరిస్థితికి తీసుకురావడానికి అన్ని చర్యలను కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ సహకరించాలని కోరారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారు సార్...!

**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** : కలువాయి మండలంలోని కుల్లూరు గ్రామంలో గుంజి రవి ప్రభుత్వ స్థలాలు, గ్రామస్తుల డి పట్టాల భూములను ఆక్రమిస్తున్నారంటూ సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్ష్ శుక్లకి కుల్లూరు గ్రామానికి చెందిన దేవర కొండా శ్రీరాములు, దేవరకొండ వెంకట సుబ్బయ్య, తుపిలి లక్ష్మమ్మ, ఏగు నర్సింహులు ఫిర్యాదు చేశారు. కుల్లూరు గ్రామంలో గుంజి రవి పనులు చేయిస్తానని ప్రలోభాల కు గురిచేసి, ప్రభుత్వ, ఆర్అండ్‌బి భూముల్లో దారులు లేకుండా గుంతలు తవ్వి, పెద్ద పెద్ద గేట్ లు పెట్టారని, కావాలని అసత్య ఆరోపణలతో తప్పుడు ఫిర్యాదులు చేయిస్తు గ్రామంలో అలజడి సృష్టిస్తున్నాడని, క్షేత్రస్థాయిలో విచార చేపడితే ఆక్రమించిన విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. ప్రభుత్వ డీ పట్టా భూములను ఆక్రమించి, తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై కూడా కలువాయి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. గుంజి రవి అనుచరులతో కలిసి సర్వే నెంబర్ 6672బి,7231,733, 552/1ల నందు ఆక్రమించి వేరే వారికి కూడా అమ్మడం జరిగిందని అర్జీలో పేర్కొన్నారు.



## రైతుల హక్కులే ప్రధాన లక్ష్యం



**తోటపల్లి గూడూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లాలో చేపల రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా మంచినీటి చేపల యాజమాన్య సంఘం కట్టుబడి పనిచేస్తోందని సంఘం అధ్యక్షుడు బాబు నాయుడు స్పష్టం చేశారు. సంఘంపై ఇటీవల వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ, అవి పూర్తిగా అసత్య ప్రచారమని మండి పడ్డారు. ఈ సంఘం కేవలం రైతుల ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తోంది. ఎవరైనా స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న ఆరోపణలను మేము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించము అని బాబు నాయుడు గట్టిగా హెచ్చరించారు. కొందరు వ్యక్తులు రైతులను తప్పుదారి పట్టించేందుకు కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సంఘం ఏర్పాటైనప్పటి నుంచి రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఎలాంటి ఒత్తిళ్లకైనా తలొగ్గకుండా రైతులకు న్యాయం చేయడమే తమ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రైతు ప్రయోజనం ముందు.. మిగతా విషయాలు తరువాత" అని ఆయన తేల్చి చెప్పారు.

**– తొందరపాటు అమ్మకాలు నష్టానికి దారి** రైతులకు సూచిస్తూ, మార్కెట్ పరిస్థితులను అంచనా వేసి సరైన సమయంలో చేపలు అమ్మితేనే లాభాలు సాధ్యమవుతాయని బాబు నాయుడు వివరించారు. తొందరపడి అమ్మితే నష్టం తప్పదు. కొంతకాలం ఆగితే మంచి ధరలు వస్తాయి. సంఘం సూచనలు పాటిస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు.

**– మధ్యవర్తులపై కఠిన వ్యాఖ్యలు** మధ్యవర్తులపై ఆధారపడకుండా రైతులు నేరుగా సంఘంతో కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యవర్తుల దోపిడీకి తావివ్వకూడదు. రైతులే తమ ధరలను నిర్ణయించే స్థాయికి రావాలి. అందుకు ఐక్యత అవసరం అని ఆయన చెప్పారు.

**– అపోహలకు తావులేదు..** నేరుగా సంఘాన్ని సంప్రదించండి సంఘంపై వస్తున్న విమర్శలు కేవలం అపోహలేనని, వాటిని రైతులు నమ్మవద్దని బాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా సంఘాన్ని సంప్రదించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి సంఘం ఎల్లప్పుడూ ముందుం టుందని తెలిపారు. చివరగా, రైతుల కోసం పోరాడే ఈ సంఘాన్ని ఎవరూ తప్పుదారి పట్టించలేరు. స్వార్థ ప్రయోజనాల కోసం చేసే ప్రయత్నాలను మేము గట్టిగా ఎదుర్కొంటాం అని బాబు నాయుడు స్పష్టం చేశారు.

## రేషన్ డీలర్ల మాయాజాలం బహిర్గతం..

**– కాటా పేరుతో లబ్ధిదారుల హక్కులపై కోత!**



**తోటవల్లి గూడూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ ధాన్య పంపిణీలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు తోటపల్లి గూడూరు మండలంలో కలకలం రేపుతు న్నాయి. కొందరు రేషన్ డీలర్లు "కాటా" పేరుతో బియ్యం తక్కువగా ఇచ్చి, లబ్ధిదారుల హక్కులను బహిరంగంగా కుదిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో వ్యక్తికి నెలకు 5 కిలోల చొప్పున బియ్యం ఇవ్వాల్సి ఉండగా, కుటుంబ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా ఇవ్వాల్సిన మొత్తాన్ని డీలర్లు తగ్గిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నలుగురు సభ్యుల కుటుంబానికి 20 కిలోలు ఇవ్వాల్సిన చోట 17 కిలోలు, ముగ్గురు ఉన్నవారికి 15 కిలోలు బదులుగా 12 కిలోలు మాత్రమే అందుతున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. కాటా పేరిట ప్రతి కార్డుపై కనీసం 2 నుంచి 3 కిలోల వరకు కోత విధించడం సాధారణంగా మారిందని వాపోతున్నారు. ఇది ఒక్కటి రెండు దుకాణాలకు పరిమితమైన సమస్య కాదని, మండలంలోని దాదాపు 44 రేషన్ షాపుల్లో ఇదే తరహా అవకతవకలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెలవారీగా పేదల బియ్యంపై కోతలు వేయడం వల్ల వందల క్వింటాళ్ల ధాన్యం అక్రమ లాభాలుగా మారుతున్నదని అంచనా వేస్తున్నారు.ఇదంతా జరుగుతున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సరైన స్పందన లేకపోవడం, కొందరు డీలర్లకు రాజకీయ అండ ఉందనే అనుమానాలకు తావిస్తోంది.పేదల పొట్ట కోసే ఈ దోపిడీని తక్షణమే అరికట్టాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి రేషన్ షాపులో తూకాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిరంతరం తనిఖీలు చేపట్టి, పంపిణీపై కఠిన పర్యవేక్షణ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పేదల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఉన్న యంత్రాంగం వెంటనే స్పందించి, రేషన్ డీలర్ల మోసాలకు చెక్ పెట్టాలని ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

## డ్రైనేజీ కాలువ ఆక్రమణతో కోవెరపాలెంలో కలకలం

**– ఇబ్బందుల్లో 50 కుటుంబాలు**



**తోటపల్లి గూడూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం కోవెరపాలెం గ్రామంలో డ్రైనేజీ కాలువ ఆక్రమణ వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. దాదాపు 50 కుటుంబాలు ఆధారపడిన ముఖ్యమైన కాలువను ఒక వ్యక్తి పూడ్చివేయడంతో గ్రామంలో పరిస్థితి విషమించింది. ఈ వ్యవహారంపై గంగపట్నం సతీష్ గ్రామస్తులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కాలువ మూసివేయడంతో ఇళ్ల ముందు మురుగు నీరు నిలిచి పోతుందని, దుర్వాసన వ్యాపించి దోమలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామస్తుల మాటల్లోనే చెప్పాలంటే,"ఇది కేవలం కాలువ సమస్య కాదు.. జీవన విధానాన్ని సంక్షోభంలోకి నెట్టేసిన ఘటన" అని ఆవేదన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యేలు, సంబం ధిత అధికారులను ఆశ్రయించినప్పటికీ సరైన స్పందన రాకపోవడం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తునఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నా రు.ఆక్రమణను తక్షణమే తొలగించి కాలువను పునరుద్ధరించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకో వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## అరుంధతివాడ పిహెచ్‌సిని తనిఖీ చేసిన అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ





**ఆత్మకూరు, ఏప్రిల్27, ప్రభాతవార్త:** నెల్లూరుజిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మరియు జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి సోమవారం పట్టణంలోని అరుందతివాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న వైద్యసేవలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని పలు విభా గాలను పరిశీలించారు.కిశోరబాలికలకు అంది స్తున్న విహెచ్‌పి వ్యాక్సినేషన్ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం టిబి ముక్త్‌భారత్ లక్ష్యంలో భాగంగా క్షయ వ్యాధి నిర్ధారణ పరిక్షలు, ల్యాబ్ రికార్డులు, రోగులకు అందుతున్న పోషకాహార సహాయం తదితర రిజిస్టర్లను తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బబారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ ఖాదర్‌వల్లి సిబ్బందికి సూచించారు. ఇందుకోసం కేద్రంలో ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ కార్నర్‌ను పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు.తీవ్రమైన ఎండల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప మధ్యాహ్నం 12నుండి 4గంటల వరకు బయటకు రాకూడదన్నారు. ఒకవేళ వెళ్ళాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా నీరు , ద్రవపదార్థాలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మష్కూర్, హెచ్ఇఒ ఎస్.సుధాకర్, హెచ్‌వి పార్వతి, హెల్త్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ , ఆరోగ్యసిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడే ఉచిత వడుగుల కార్యక్రమం



**బిట్రగుంట ఏప్రిల్ 27 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీలోని ఇబ్రహీంపేట జామియా మసీదు ప్రక్కన ఉన్న ఎం.కె హాల్ కళ్యాణ మండపం బిట్రగుంట లో బిఎంఆర్ చారి ట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జరుగు ఉచితపేద ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్న వైద్య శిబిరాన్ని కావలి నియోజవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిఎంఆర్ యువసేన అధ్యక్షులు షేక్ షమీ ఉల్లా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు

## మెట్ట ప్రాంత అభివృద్ధి ప్రదాయిని పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు నీరందించాలి

**– ఫ్లోరైడ్ బాధితులను ఆదుకోవాలి, మెట్ట ప్రాంత వలసలను నివారించాలి**

**– బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్**



**నెల్లూరు అగ్రికల్చర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** మెట్ట ప్రాంతానికి అభివృద్ధి ప్రదాయినిగా ఉన్న పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు నీరందించాలని, మెట్ట ప్రాంత వలసలను నివారించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్టీ నేతలతో కలిసి నెల్లూరు రామలింగాపురం సెంటర్‌లో ఉన్న జల వనరుల శాఖ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన తెలియజేసి, ఆ శాఖ డీఈ అనిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ ద్వారా సీతారాంపురం, వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు మండలాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, ఆరిజర్వాయర్ పనులను అర్థాంతరంగా ఆపేశారని, ఇలాంటి పరిస్థితుల్లో జులై 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంలో 11 గ్రామాల భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాల్సి ఉందని, బైరవకోన వద్ద కొంత భాగం కొండను తొలిచి నీరు అందించాల్సిన పరిస్థితులు ఉంటే, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడం లేదన్నారు. అంతే కాకుండా రెండు టన్నెలన్స నుండి తీసిన రెండు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిదిబ్బలను తొలగిస్తేనే నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాలు ఉండవని తెలియజేశారు. అత్యవసరంగా 1000 కోట్ల నిధులు విడుదల చేస్తేనే వెలుగొండ ప్రాజెక్టులో నీరు నింపే అవకాశం కలుగుతుందన్నారు. వెంటనే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు నీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు కందికట్ల రాజేశ్వరి, నరాల సుబ్బారెడ్డి, బాలకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, దేగా మధు, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు

**బిట్రగుంట ఏప్రిల్ 27ప్రభాతవార్త :** బోగోలు మండలంలో పెట్రోల్ బంకులో వినియోగదారులకు సక్రమంగా పెట్రోలు డీజిల్ సరఫరా కావడం లేదు. పెట్రోల్ బంకులందు నో స్టాక్ బోర్డులు పెట్టి వెనక వైపు నుండి పలుకుబడిన వ్యక్తులకు అడ్డదారుల్లో విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో వ్యవసాయ పంటలకు సంబంధించిన కోతలు జరుగుతున్నడంతో పెట్రోల్ డీజిల్ రైతులకు అత్యవసరంగా ఉంది సకాలంలో అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అందుబాటులో వినియోగదారులు, రైతులకు పెట్రోల్ డీజిల్ సకాలంలో అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## వైభవంగా ధ్వజారోహణం





**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మాజీ దేవస్థానం చైర్మన్ పోలుదాసు వెంకటేశ్వర్లు వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలోరుత్వికులు రాఘవాచార్యులు, నాగరా జాచార్యులు దేవస్థాన పునఃనిర్మాణ దాత కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ దంపతులు జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, లక్ష్మి, భక్తులు ఉన్నారు.

## హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాల యంలో సోమవారం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైతన్యవేదిక సభ్యులు మాట్లాడుతూ గో వధను దేశ వ్యాప్తంగా నిషేధి ంచాలన్నారు. గో వధకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు విధించా లన్నారు. గోవు హిందువులకు పరమ పవిత్రమై నదని దాని రక్షణ ప్రభుత్వ బాధ్యతే అన్నారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ఈ సందర్భంగా వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక సభ్యులు ఉన్నారు.

## ఎరువుల యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలి



**వేగూరు(కోవూరు,) ఏప్రిల్ 27 ప్రభాతవార్త:** ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవ సాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరు వులు వాడుకోవాలని మండల వ్యవసా యాధికారి టి.రజని అన్నారు. కోవూరు మండలం వేగూరు గ్రామంలో సోమవారం అధిక యూరియా వాడడం వలన కలిగే నష్టాలపై రైతులకు వివరిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు లు యూరియాను తమ ఇష్టానుసారంగా అధిక ంగా వినియోగించడం వలన వరి పంట ఏపుగా పెరిగి పంట ముదురు ఆకుపచ్చ రంగుగా మారడం వలన తెగుళ్ల ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు నేల, వాయు కాలుష్యం కూడా పెరిగి పోతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతు ఒక ఎకరాకు 3 బస్తాల యూరియా మాత్రమే వాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం యూరియాకు సంబంధించిన కార్డులు ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఉన్నాయని, వాటి ద్వారా యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎం మౌనిక, రైతులు ఉన్నారు.

## వైభవంగా నాలశిలా ప్రతిష్ఠ





**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ దక్షిణాముఖ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు జనార్ధనం నాగరాజా దంపతులు సోమవారం ఆలయ ప్రాంగణంలో నూతన నాగ శిలా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా రుత్వికుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వాస్తు హోమం పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు ప్రాతఃకాలమునే స్వామివారికి అభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.రుత్వికులు భాను స్వామి, కృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, జనార్ధనం నాగరాజాచార్యుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డీజల్, పెట్రోల్ నో స్టాక్



**కోట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** కోట మండలంలో పెట్రోల్, డీజల్ సరఫరాలో కోతలతో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయిల్ కంపెనీలో సరఫరాలో కోటా విధానం అమలుతో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు వాహనదారులకు సమస్యలు ఎదురవుతున్నాయి. పెట్రోల్ సరఫరాలో కొత్త నిబంధనలతో పలుచోట్ల బంకులు మూతపడుతున్నాయి. సోమవారం విద్యానగర్‌లోని ఓ పెట్రోల్ బంకులో డీజల్, పెట్రోల్ అయిపోవడంతో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. ఆయిల్ కంపెనీల నుంచిసరఫరాలో కొత్త నిబంధనలతో సమస్యలు ఎదురవుతున్నాయి. డిమాండ్ మేరకు ఆయిల్ కంపెనీలు సరఫరా చేయలేకపోతున్నాయి. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే మరో వైపు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎక్కడా పెట్రోల్, డీజల్ కొరత లేదని ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ సమస్యలకు అధికారులే జవాలు చెప్పాల్సి ఉందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

## రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభం



**నెల్లూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని కందమూరు ఉప్పుటూరు గ్రామాలలో 25 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిఎన్నికల వరకే రాజకీయాలు ఎన్నికలు లేని వేళ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తాం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నెల్లూరు రూరల్ మండలాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కందమూరు, ఉప్పుటూరు గ్రామల అభివృద్ధికి 6 కోట్ల 57 లక్షల రూపాయలు నిధులు కేటాయించాము. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి, కూటమి ప్రభుత్వానికి ఎల్లవేళలా మీ ఆశీస్సులు ఉండాలి. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డినెల్లూరు రూరల్ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, యువ నేత, రాష్ట్ర నారాలోకేష్‌కి, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డికి, టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు శాసనమండల సభ్యులు బీద రవిచంద్రకి నెల్లూరు రూరల్ ప్రజలపక్షాన నా ప్రత్యేక ధన్యవాదాలు.టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిపై కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జ్ జలదంకి సుధాకర్, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంఛార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, టిడిపి నాయకులు చెరుకూరు చిన్న పెంచల నాయుడు, చెరుకూరు పెద్ద పెంచల నాయుడు, చెరుకూరు సింహాద్రి నాయుడు, మధు, రామానాయుడు, ఈశ్వరయ్య, ఎం.ప్రసాద్, పెంచలయ్య , మహేశ్వర్, ఏడుకొండలు, రఘురామయ్య, ప్రసాద్, లోకేష్, మస్తాన్, కిష్టయ్య, పట్టాభి, ఉప్పుటూరు గ్రామ మాజీ సర్పంచ్ అంబటి వెంకటసుబ్బారెడ్డి, రాపూరు పెంచలయ్య, రాపూరు పెంచల బాబు, అంబటి శ్రీనివాసులు రెడ్డి, గుద్దటి సుధీర్ రెడ్డి, ఉప్పుటూరు రెడ్డి, గుంజి సుబ్బయ్య, బేతాళం మురళి, రాపూరు హరిబాబు, సుంకర సీనయ్య, మదనపల్లి శివయ్య,రాపూరు మస్తానయ్య, రాపూరు మురళి, బెల్లంకొండ చెంచురత్నం, బెల్లంకొండ చెంచయ్య, రాపూరు వెంకట కృష్ణయ్య, గుర్రంకొండ రవీంద్ర, అచ్చి పెంచలయ్య, బెల్లంకొండ వెంకటరత్నం, గుంజి రాదయ్య, తానికొండ వెంకటేష్, తానికొండ తిరుమలేష్, రాము, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అసమర్ధత వల్ల పెట్రోల్, డీజిల్ కొరత కాకాణి



**నెల్లూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** నెల్లూరు సిటీ లోని ఓ పెట్రోల్ బంక్ ను సందర్శించి క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించి పెట్రోల్, డీజిల్ కోసం వచ్చిన రైతులతో, వాహనదారులతో మాట్లాడిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు "డా" కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉదయం నుండి బంకుల చుట్టూ తిరుగుతున్నామని ఎక్కడా డీజిల్ పట్టలేదని కాకాణి ఎదుట క్యాన్‌లు పట్టుకొని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన రైతులు రైతులు డీజిల్ కొరకు పడుతున్న ఆవేదనను చూసి చలించిపోయిన కాకాణి కూటమి ప్రభుత్వ వైఫల్యం, చంద్రబాబు అసమర్ధత వల్లే ఈ దారుణ పరిస్థితి కూటమి పాలనలో రైతులకు , సాధారణ ప్రజలకు, కష్టాలు తప్పడం లేదు చంద్రబాబుకు ముందు చూపు లేని కారణంగా రవాణా వ్యవస్థ స్తంభించి, ప్రజలు అవస్థలు పడుతున్నారూ ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడిన ఇంధన కొరతకు చంద్రబాబు వైఫల్యమే కారణమన్న ప్రభుత్వం తక్షణమే ఇంధన నిల్వలను పునరుద్ధరించి, ప్రజలకు ఉపశమనం కలిగించాలి ఇంధన కొరత కారణంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది, తద్వారా నిత్యావసర సరుకుల రవాణాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది ప్రజలకు ఏ సమస్య వచ్చినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలియజేస్తున్నాం .

## విపిఆర్‌ది అద్భుత సేవాతత్పరత...వంటేరు



**జలదంకి, ఏప్రేల్27, ప్రభాతవార్త:** నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డిలు విపిఆర్ ఫౌండే షన్ ట్రస్టు ద్వార అద్భుత సేవలు అందిస్తు వేనోళ్ళ కొనియాడబడుతున్నారని కావలి మాజి శాసనసభ్యుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి శ్లాఘించాడు.సోమవారం విపిఆర్ నేత్ర వంటేరు స్వగ్రామమైన జలదంకి మండలం బ్రాహ్మణ క్రాకలో నిర్వహించారు.ఈసందర్భంగ నేత్రను వంటేరు ప్రారంబించి ట్రస్ట్ సేవలను ప్రజాసేవలో ఆదంంతుల తరిస్తున్న వైనాన్ని వివరించడు. ఉదయగిరి నియోజకవర్గంలోని 7మండలాలలో అత్యాదునిక పరికరాలతో కంటి పరీక్షలు చేసి ఉచిత కంటి అద్దాలు అందించడంతోపాటు విలువైన సూచనలు సలహాలు అందించి అందరి ప్రేమాభి మానాన్ని అందుకున్న తీరు వర్ణనాతీతమని అన్నారు.ప్రస్తుతం జలదంకి మండలంలో నేత్ర కొనసాగుతుందని వివరించాడు.కంటి సమస్యలు వున్న వారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వంటేరు పిలుపుని చ్చాడు.సేవే పరమావదిగ వేమిరెడ్డి ముందుకు సాగుతున్న వైనం అందులోను ఈనేత్ర గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డుల కెక్కడం ఖాయమని అన్నారు.ఎందుకంటే ఒక్క మన నియోజకవర్గంలోనే 50వేల మందిని పరీక్షించారని ఆలెక్కప మొత్తం పార్లమెంట్ పరిదిలో 3లక్షల యాభైవేలమంది పైచిలుకు రోగులకు నేత్ర సేవ లు అందిస్తారని ఆయన అంచనావేశాడు.ఒక సేవాసంస్థ లక్షల మందికి కంటి పరీక్షలు చేయడం కచ్చితంగ ప్రపంచరికార్డేనని స్పష్టంచేశాడు.ఇంతకంటే ఔదా ర్యం చూపించే వారు ఎక్కడైన వున్నార అని ప్రశ్నించాడు. కావున మన మందరం వారి సేవాతత్పరతను గూర్చి గొప్పగ చెప్పాల్సిన తరుణమిదేనని అన్నారు.అంతేకాదు విపిఆర్ ట్రస్ట్ ట్రైసైకిళ్ళ పంపిణి ఒక మహాయజ్ఞంగ చేపట్టి వేలాదిమంది వికలాంగులకు ఊరటనిచ్చారని గుర్తుచేశాడు.అలాగే ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసి పల్లే ప్రజల దాహార్తిని తీర్చడం ఎవరివల్ల అవుతుంది ఇదికద నిజమైన సేవంటే వేమిరెడ్డి విశాల హృదయానికి ఇంతకంటే నిదర్శనమేముందని అన్నారు.విద్య, వైద్యం అన్నదానం, నేత్రదానం, దేవాలయాలు ఈవిదంగ చెప్పుకుంటు పోతే అన్నింటిలో వారు తరించారనే చెప్పవచ్చన్నారు వేణుగోపాలరెడ్డి.అదేవిదంగ జలదంకి మండలంలో సాగే నేత్ర కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి ఆద్వర్యంలో ముందుకు సాగుతుందని ఈసందర్భంగ వంటేరు తెలియజేశాడు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబా బునాయుడు పిలుపు మేరకు పి4 కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుడుతామని ఆవివరాలను ఆయన వెల్లడించాడు .అందులో బాగంగ ముందుగ మండలంలోని 5 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్ధి విద్యార్ధులకు దాదాపు 1300వందల మందికి సైకిళ్ళు ఆందించనున్నామని తెలిపాడు.ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రదానోపాద్యాయులు, ఎంఇఒలతో చర్చించి విది విదానాలను రూపొందించినట్టు వివరించాడు.అలాగే.బడులు పునఃప్రారంభమైన వెంటనే విద్యార్ధులకు అందిస్తామని అన్నారు.అంతేకాకుండ మరెన్నో అటు విద్యార్ధులకు ,విద్యాలయాలకు ఏది అవసరమో అవి సమకూర్చే దానికి ప్రణాళికలు సిద్దంచేస్తున్నామని అదే క్రమంలో రైతాంగాని కూడ వీలైనంత సాయం చేసేదానికి అలోచిస్తున్నామని వివరించాడు.అయి తే ఈదత్తత విషయంలో కొంతమంది సెటైర్లు వేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని మంచి చేసేప్రయత్నంలో అందరు బాగస్వాములైతే అది మరింత విజయ వంతమవుతుందని అలా కాకుండ వ్యంగ్యాస్త్రాలతో కాలం వెళ్ళబుచ్చడం సరైన విదానంకాదని హితవు పలికాడు.అటు ప్రభుత్వ పరంగ, ఇటు వంటేరు వరదా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వార మండలానికి సేవ చేయాలని తలంచానని అవిదంగ కచ్చితంగ ముందుకుపోయి సఫలీకృతమౌతానిని ఈసందర్బంగ వంటేరు దీమావ్యక్తంచేశాడు. చేశాడు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, ఏప్రిల్ 27ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో సోమవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దేవస్థానం వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన పునః నిర్మాణ దాత కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి – లక్ష్మి దంపతులు, మాజీ దేవస్థాన చైర్మన్ పోలుదాసు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వవ్వేరు బ్యాంకు వద్ద చలివేంద్రం ఏర్పాటు





**బుచ్చి ఏప్రిల్ 27 ప్రభాతవార్త** బుచ్చి రెడ్డిపాళెం వవ్వేరుబ్యాంకు వద్ద సోమవారం డిసిఐ గురప్ప, బ్యాంకుచైర్మన్ దొడ్ల విజయ లక్ష్మీ మజ్జిగ ,మంచినీళ్ళు చలివేంద్ర ప్రారం భించారు. ఈ సందర్భంగా మజ్జిగ, మంచి నీరు ప్రజలకు అందించారు. ఈ కార్యక్ర మంలో వారు మాట్లాడుతు ప్రస్తుతం వేసవి తీవ్రత చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. బ్యాంకువద్ద చలివేంద్ర ఏర్పాటు చేస్తే బ్యాం కు వచ్చేవారికి, రైతులకు,ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలి పారు. వేసవి తీవ్రత తగ్గేవరకు చలి వేంద్ర కొనసాగించనున్నట్లు వారు స్పష్టం చేశారు.. ఈకార్యక్రమంలో సీనియర్నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి, బ్యాంకు డైరక్టర్ పెద్దిసాని మాల్యాద్రి,డైరక్టర్, కోవూరు పద్మావతి, సిఇఒ ఎం. శ్రీనివా సులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే



**గూడూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** గూడూ రు పట్టణంలోని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ప్రిన్సిపాల్ ఇబ్బంది పెట్ట డంతో ఈ సమస్యను ప్రభుత్వానికి ఎమ్మె ల్యే తెలియజేయడంతో ప్రిన్సిపాల్ వైఖరి సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వం ప్రిన్సిపాల్ను సస్పెండ్ చేసింది. కళాశాల నిర్వహణపై అధ్యాపకులు విద్యార్థులతో ఎమ్మెల్యే సునీల్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు అంశాల గురించి చర్చిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదువుకొని ఈ స్థాయిలో ఉన్నానని ఇటీవల విద్యార్థిల పట్ల ప్రిన్సిపాల్ వైఖరి బాధ కలిగించిందని అన్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగి న ఎస్కేఆర్ కాలేజీలో ఎక్కువ అడ్మిషన్లు జరిగేలా విద్యార్థులు వారికి తెలిసిన వారికి చెప్పాలని సూ చించారు. కళాశాల పూర్వపు విద్యార్థిగా ఎటువంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నా మని వెల్లడించారు. ఈ సమావేశంలో చెంచురామయ్య,రహీం, నాగేంద్ర ప్రసాద్, పెంచలయ్య, సురేంద్ర, మస్తాన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఘన, ద్రవ జీవామృతల పై అవగాహన



**గూడూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** ఆం ధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్మెంట్ న్యాచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో గూడూరు మండల వ్యవసాయ శాఖ సిబ్బందికి, ఏపీ సి.ఎన్. ఎఫ్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్య క్రమంలో భాగంగా మొదటి రోజు శిక్షణా కా ర్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి, గూడూరు వి.రమేష్, ఏపీ సిఎన్ఎఫ్ఎంఎన్టి పూర్ణిమ, మెంటార్ విజయకుమారిలు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎలినో ను ఎదుర్కోవడంలో సిఎన్ఎఫ్ పాత్రను వివరించారు. వ్యవ సాయంలో ఘన, ద్రవ జీవామృతాలు, విత్తన గుళికలు యొక్క ఉపయోగాలను వివరించి, వాటి తయారు విధానాన్ని డెమోగా చూపించడం జరిగింది. అలాగే రానున్న ఎల్నీనో యొక్క ప్రభావాన్ని ఎదుర్కోవడానికి పిఎండిఎస్ ఎంత గానో ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులను పిఎండిఎస్ వాడేలా చూడాలని తెలియజేశారు. రైతుకు నిరంతర ఆదాయాన్నిచ్చే ఎనీ టైమ్ మనీ మోడల్ పై శిక్షణ, క్షేత్ర సందర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు, డీజిల్ తగినంత నిల్వలు ఉన్నాయి : ఆర్డీవో సత్యనారాయణ



**గూడూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** జిల్లాలో డీజిల్ పెట్రో లు తగినంత నిల్వలో ఉన్నాయని వాహనదారులు ఎవరు ఆందోళన చెందవద్దని ప్రతి పెట్రోల్ బంకు వద్ద విఆర్ఓ ను ఏర్పాటు చేశామని రైతులు తమ పొలం వివరాలు తెలియ జేసి క్యాన్ల ద్వారా పెట్రోల్ డీజిల్ తీసుకుపోవచ్చు అని గూ దూరు ఆర్డీవో సత్యనారాయణ వెల్లడించారు. గూడూరు పట ్టణంలోని పలు పెట్రోల్ బంకులను ఆర్డిఓ సత్యనారాయణ పరిశీలించారు. పెట్రోల్, డీజిల్ కొరకు వాహ నాలు బారులు తీరాయి. ఈ సందర్భంగా ఆర్డీవో సత్యనారా యణ మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ నిల్వలు తగినంత ఉన్నాయని అయితే ప్రజలు పెట్రోల్ దొరకదేమో అని ఆందోళనలో ఒక్కసారిగా వస్తు న్నారని తెలి పారు. డివిజన్ వ్యాప్తంగా 27 పెట్రోల్ బంకులు ఉన్నాయని ప్రతిరోజు ఆయిల్ ట్యాంకర్లు వస్తు్న్నాయని టు వీలర్ కు మూడు లీటర్లు ఫోర్ వీలర్ కు 20 లీటర్లు భారీ వాహనాలకు 50 లీటర్లు పెట్రోల్ డీజిల్ విక్రయించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రతి పెట్రోల్ బంకు వద్ద విఆర్వోను ఏర్పాటు చేశామని, రైతులు పొలాల్లో ట్రాక్టర్లకు ఆక్వా రైతులకు కావలసిన డీజిల్ పెట్రోలు పొలం వివరాలు తెలియ జేసి తీసుకుపోవచ్చు అని పేర్కొన్నారు. ఈయన వెంట గూడూరు తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బాలుడు హత్యకేసులో నిందితుడు లొంగుబాటు

**గూడూరు రూరల్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** ఇటీవల జరిగిన బాలుడు హత్యకేసులో నిందితుడైన మైనర్ బాలుడు తహసీల్దారు ప్రసాద్ ముందు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య తెలి పారు. ఈ నెల 8వ తేదీన చెన్నూరు గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడిని వేములపాళెం సమీపంలోని ఓ తోటలో సైదాపురం మండలానికి చెందిన 17 ఏళ్ల బాలుడు గొంతు నులిమి హత్య చేసి అదే తోటలో పూడ్చిపెట్టడం జరిగిందన్నారు. ఈ హత్య తానే చేసినట్లు స్వచ్ఛంధంగా వచ్చి లొంగిపోయాడన్నారు. దీంతో తహసీల్దారు, ఐసీడీఎస్, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది సమక్షంలో పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసుకుని మైనర్ బాలుడ్ని చైల్డ్ హోమ్కి తరలించామని ఎస్ఐ తెలిపారు.

## కోనలో నృసింహుని బ్రహోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ





**రాపూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వా మి వారి బ్రహ్మోత్స వాలకు సోమవారం సాయంత్రం అంకు రార్పణ కార్యక్రమంలో శాస్త్రోక్తంఆ నిర్వహిం చారు. ఇందు లో బాగంగా స్వామి వారి ఉద్యానవనం నుండి పుట్టమట్టిని తీసుకొని వచ్చి అంకురార్పణనిర్వహించారు. అనుజ్ఞ, విష్వక్షే నారాధన, పుణ్యాహావచనం, సేనాధిపతి ఉత్సవం వైభ వంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సతీమణి సింధు, ఆలయ ఉప కమీ షనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఆలయ ఫెస్టివల్ కమిటీ భాధ్యులు చెన్ను తిరిపాల్ రెడ్డి, పీర్ల సోమయ్య, పలువురు సభ్యులు ఆల య ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెం చల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుం డ్లూరు శశి స్వామి, పలువురు వేదపండితులు వున్నారు. బ్రహ్మోత్స వాలలో నేడు బ్రహ్మోత్స వాలలో మంగళవారం ఉదయం 10.42కి ధ్వజారోహణ, 11.30కి స్నపన తిరుమంజనం,సాయంత్రం 5.30కి సహస్ర దీపాలంకరణ రాత్రి 9 కి శేషవాహన సేవ నిర్వహిస్తారు.

## చెరువుల మరమ్మత్తులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సరిపురం పంచాయితీ పరిధిలోని సిరిపురం నారాయ ణ పురం చెరువుల మరమ్మత్తులకు ఎఫ్డిఆర్ఆర్ నిధులతో కోటి పదిలక్షలు రుపాయలు వ్యయంతో చేపట్టిన పనులకు స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. గ్రామ ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజ లతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకుని పరి ష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉం దని ప్రజలకు అన్ని విధాలుగా అందగా ఉంటానని తెలిపారు. కావలి రూరల్ మండలంలో చేపడుతున్న చెరువుల మరమ్మత్తులు సాగునీటి అవసరాలను తీర్చడమే కాకుండా స్థానిక రైతులకు పెద్ద ఎత్తున ఉప యోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆవుల రామక్రిష్ణ, మాజీ జడ్పిటిసి సభ్యులు నాయుడు రాంప్రసాద్, అధికారులు పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాల కట్టడిపై పోలీసుల ప్రత్యేక నిఘా

**- గూడూరు రూరల్ సిఐ కిషోర్బాబు**



**కోట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో దొంగతనాలను కట్టడి చేయడంపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు గూడూరు రూరల్ సిఐ కిషోర్బాబు తెలిపారు. సోమవారం ఆయన 'ప్రభాతవార్త'తో మా ట్లాడుతూ వేసవి సెలవుల్లో అనేక కుటుంబాలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాం తాలకు ప్రయాణాలు చేసే నేపథ్యంలో ఖాళీగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ప్రజలు సైతం జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. ప్రజ లు ఇళ్లలో బంగారం, డబ్బులను నిల్వ ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్ర పరచుకోవాలన్నారు. అలాగే ప్రయాణాలకు ముందు సమీప పోలీసుస్టేషన్లో సమాచారం అందించాలని, తద్వారా ఎల్హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) ద్వారా ఇళ్లపై ప్రత్యేక నిఘాతో పాటు ఆ ప్రాంతంలో బీట్ పోలీసు పెట్రోలింగ్ సైతం పెంచుతామన్నారు. అలాగే ఇంటి వద్ద సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రతను మరింత బలోపేతం చేసుకోవచ్చని తెలిపారు. ఇళ్ల మిద్దెలపై నిద్రించే వారు ఇంటికి తాళాలు వేసి వాటిని తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. మీ ప్రయాణాల వివరాలను నమ్మకమైన వారికి, పొరుగు వారికి, బంధువులకు తెలియజేయాలన్నారు. అలాగే ఇంటి తలుపులు, కిటికీలు సురక్షితంగా లాక్ చేసినట్లు నిర్ధారించుకోవాలన్నారు. అవసరమైతే ఆటోమేటిక్ లాకింగ్ సిస్టం లేదా అలారం వ్యవస్థలను వినియోగించాలన్నారు. ఇంటి గేటుకు తాళం వేసేటప్పుడు బయట తాళం కనపడకూడదని, లోపల గడియకు తాళం పెట్టుకోవాలని సూచించారు. అపరిచితులు ఇచ్చే ఆహారాన్ని స్వీకరించకూడదని సూ చించారు. అలాగే ఇంటి బయట నిద్రించే వారు ఆభరణాలు ధరించకూడదన్నారు. అనుమానాస్పద పరిస్థితి, అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే 100కు కాల్ చేయాలన్నారు.

## ఆలయంలో వైభవంగా వేడుకలు

**కోట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త** కోట మండలం తిమ్మానాయు డు పాలెం గ్రామంలో నూతనంగా ని ర్మించిన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీసంత కాళహస్తిస్వామి ఆల యంలో మహా కుంభాభిషేక మ హోత్స వాల్లో భాగంగా సోమ వా రం ఆలయ ప్రాంగణంలో వేద పండితులు హోమాలు నిర్వహిం చారు. అంకురార్పణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీ పా లతో అందంగా అలంకరించారు. ఆలయ ఛైర్మన్ మల్లాపు రమేష్శెట్టి ఆధ్వర్యంలో ఈ ఉత్స వాలు వైభవంగా జరుగుతున్నాయి. మేళతాళాలు, తప్పెట్లతో అంగరంగ వైభవంగా మహోత్స వాలు నిర్వహిస్తున్నారు.

## 30వ తేదీ పండ్ల మార్కెట్ ప్రారంభోత్సవం

**- కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి పండ్ల మార్కెట్గా నామకరణం**

**- మార్కెట్ కమిటీ , వ్యాపారస్తుల నిర్ణయం - నెరవేరనున్న పండ్ల మార్కెట్ దశాబ్దాల కల**



**నెల్లూరు అగ్రికల్చర్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** నెల్లూరులోని ఏసీ మార్కెట్ పక్కనున్న పండ్ల మార్కెట్ను ఈనెల 30వ తేదీ రూరల్ ఎమ్మె ల్యే కోటంరెడ్డి శ్రీదర్రెడ్డి ప్రారంభిస్తారని ఏ ఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీదర్రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మార్కెటింగ్ శాఖ కార్యాల యంలోని తన ఛాంబర్లో మీడియా సమా వేశంనిర్వహించి మాట్లాడారు. 2కోట్ల 91 లక్షల నిదులతో పండ్ల మార్కెట్ను అభివృద్ది చేయడం జరిగిందన్నారు. ఇదంతా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి కృషితోనే సాధ్యమైందన్నారు. అన్ని హంగులు పూర్తయి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న పండ్ల మార్కెట్ను మార్కెట్ కమిటీ, వ్యాపారస్తుల ఆకాంక్షల మేరకు మార్కెట్ పేరును కోటంరెడ్డి శ్రీదర్రెడ్డి పండ్ల మార్కెట్గా నామకరణం చేయడం జరిగిందని వివరించారు. ఇందుకు కోటంరెడ్డి సోదరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ మా ట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా పండ్ల మార్కెట్ను ఏసీ మార్కెట్ పక్కనున్న కోనేటి వద్దకు తరలించాలని ప్రయత్నాలు జరిగినప్పటికి అవి సఫలం కాలేదన్నారు. కోటంరెడ్డి సోదరుల నిరంతర కృషితోనే ఈ ప్రాం తంలో మౌలిక వస్తువులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పండ్ల మార్కెట్ ఇక్కడ ఏర్పాటు కాబోతుందని తెలిపారు. ప్రజలందరికి అనుకూలమైన ప్రదేశంలో ఈ మార్కెట్ను ఏర్పాటు చేయడం వల్ల అందరికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం ఫ్రూట్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు జిలాని భాష మాట్లాడుతూ మార్కెట్ కమిటీ తీర్మానం మేరకు పండ్ల మార్కెట్కు కోటంరెడ్డి శ్రీదర్రెడ్డి పేరు పెట్టాలని నిర్ణయించామన్నారు. దానికి వ్యాపార వర్గీయులంతా ఆమోదం ప్రకటించారని వెల్లడించారు. అనంతరం మార్కెట్ వ్యాపారి జావిద్ మాట్లాడుతూ గతంలో ఈ మార్కెట్ను ఎవరు పట్టించుకోలేదన్నారు. పండ్ల మార్కెట్ అభివృద్దిని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. పండ్ల మార్కెట్కు సంబంధించిన స్థలం కోర్టు వివాదంలో ఉంటే ఆయన పరిష్కరించారని తెలిపారు. ఇక్కడ 126 షాపులు ఏర్పాటు చేసి మమ్మల్ని మా కుటుంబాలని ఒక చోట చేర్చి ఎమ్మెల్యే శ్రీధర్రెడ్డి మా జీవితాల్లో వెలుగులు నింపారని మాటతో పాటు భావితరాలు ఆయనను గుర్తు కుపెట్టుకుంటామన్నారు. అనంతరం మార్కెట్ కమి టీ సభ్యులు పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాయి లక్ష్మణ్, గునుకుల విజ యలక్ష్మీ, భీమతాటి సుధాకర్, దాసరి అశోక్, ఈ సురేష్, నెల్లూరు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## కలిగిరి నూతన సీఐకి వింజమూరు సొసైటీ చైర్మన్ శుభాకాంక్షలు



**వింజమూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** కలిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్గా నూతనంగా బాధ్యతలు చేప ట్టిన పోతుగంటి సుబ్బారావును వింజమూరు సొ సైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ వింజ మూరు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గుర జాల గోపి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాసీఐకి పుష్పగుచ్ఛం అందజేసి వారు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వింజమూరు ప్రాంతంలోని పలు ప్రజా సమస్యలను చైర్మన్ చల్లా సీఐ దృష్టికి తీసుకెళ్లారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, సొసైటీ డైరక్టర్ కోడూరు నాగిరెడ్డి, ఎమ్మెస్ నాయుడు, పి.మాల్యాద్రి,దిద్దిగుంట శ్రీనివాస్రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు



**కోవూరు ఏప్రిల్ 27 ప్రభాతవార్త** కోవూరులోని గాంధీ పార్క్ సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కోదండ రామ స్వామి దేవస్థాన బ్రహ్మోత్స వాల్లో భాగంగా సోమ వారం రాత్రి శేష వాహన సేవలో కోవూరు ఎమ్మె ల్యే ప్రశాంతరెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భం గా ఎమ్మెల్యేను ఆలయ రుత్వికులు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు ఈ సందర్భంగా ఆమె స్వామి వారి ప్రత్యేక పూజ లో పాల్గొ న్నారు అనంతరం ఆమెను ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు పట్టు వస్త్రంతో ప్రత్యేకంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ధర్మకర్త కాటంరెడ్డి కృష్ణారెడ్డి మాజీ సి డి సి ఛైర్మన్ జక్కం రెడ్డి కృష్ణారెడ్డి ఆలయ కార్య నిర్వాహణ అధికారి దర్గయ్య పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్ రాజగోపాల్ రెడ్డి. నీటి సంఘం అధ్యక్షులు అత్తిపల్లి శివారెడ్డి బెజవాడ వంశీ కృష్ణారెడ్డి పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి అశోక్ కుమార్ మధుసూదన్ రావు బాల రవి సురేష్ రెడ్డి వెంకటేశ్వర్లు సుధాకర్, టిడిపి సీనియర్నేతలు సాయి రెడ్డి మల్లికార్జున్ రెడ్డి గురు మహేష్. సాయి జయంత్ రెడ్డి వై మదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## కావలిలో పర్యటించిన జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల





**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో కలసి జిల్లా కలెకటర్ హిమాన్షుశుక్ల సోమవారం పలు ప్రాంతాలలో పర్యటించడం జరిగింది. స్థానిక ముసునూరు వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ను పరిశీలించిన అనంతరం ఉదయగిరి రోడ్డు నుండి ఐడిఎస్ఎంటి లేవుట్ వరకు కోటి రుపాయలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ ఎలీషా, మున్సిపల్ కమిషనర్ శ్రావన్కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్డే సందర్బంగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన చైర్పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి ఏప్రిల్ 27 పభాతవార్త** గ్రీవెన్స్డే సందర్బంగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ కార్యాలయంలో చైర పర్స న్ మోర్ల సుప్రజామురళీ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిద సమస్యలు పై అర్జీలు స్వీకరించారు. కొంతమంది ప్రజలు మున్సిఫల్ కార్యాలయానికి వచ్చి అర్జీలు సమర్పించారు. ఈ సందర్బంగా చైర్పర్స న్ మోర్ల సుప్రజా మురళీ మాట్లాడుతు తన దృష్టికి వచ్చి న సమస్యను వెంటనే అధికారులకు తెలి య జేసి త్వరిత గతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు గ్రీవెన్స్డేని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. పట్టణంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొని రావాలని తన వల్లకాని పక్షంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్ర శాంతిరెడ్డి దృష్టికితీసుకొని వెళ్ళనున్నట్లు తెలి పారు. మున్సిపల్కమీషనర్ ఇనమల చినబాబు, వైస్చైర్మన్ ఎరటపల్లి శివకుమార్ రెడ్డి,సిబ్బంది ఉన్నారు.

## జిల్లా కలెక్టర్ని కలిసిన ట్రైనీ కలెక్టర్ పవన్ తేజ



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లని నెల రోజుల పాటు నెల్లూరు జిల్లాకి ట్రైనింగ్ నిమిత్తం వచ్చి ఉన్న ట్రైనీ కలెక్టర్ పవన్ తేజ జిల్లా కలెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పవన్ తేజ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

## ఘనంగా కలెక్టరేట్లో వాసిరెడ్డి జయంతి వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 27, ప్రభాత వార్త** ఆంధ్రభోజుడు, ధర్మ పరిరక్షకుడు, అమరావతి నిర్మాత రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రక టించిన నేపథ్యంలో, సోమవరం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో వారి చిత్రపటానికి పు ష్పాంజలి ఘటించి నివాళులర్పించి కలెక్టర్ హి మాన్షుశుక్ల నివాళులు అర్పించారు ఈ కార్యక్ర మానికి కలెక్టర్తో పాటు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ట్రైనీ కలెక్టర్ పవన్ తేజ, డిఆర్ఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమాలు



**సైదాపురం, ఏప్రిల్ 27, ప్రభాతవార్త** మండల పరిధిలోని చీకవోలు గ్రామంలోని పంట పొలాల్లో మం డల వ్యవసాయ శాఖ అధికారిణి హైమావతి ఆధ్వ ర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సోమవారం ఎంటీ సుబ్బయ్య ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఘనజీవామృతం, ద్రువజీ వా మృతం, టెల్లిటైజేషన్, పీఎండీఎస్ వంటి తయారీ విధానాలపై డెమో రూపంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి హైమావతి మాట్లాడుతూ రైతులు రసాయనిక వినియోగం తగ్గించుకుని ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులను ప్రకృతి సహజంగా పండించుకుంటే మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమం మంగళవారం కూడా నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహా యకులు పచ్చ రాజశేఖర్, శ్యామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కళాసేవారత్న పురస్కారాన్ని అందుకున్న సిరాజ్ మొగల్



**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని టౌన్హాల్ నందు జరిగిన సేవారత్న పురస్కారాల కా ర్యక్రమంలో ప్రముఖ సినీహిరో డివైన్ స్టార్ తల్వార్ సు మన్ చేతుల మీదుగా సేవారత్న 2025-26 పురస్కా రాన్ని సినిమారంగాన్ని ప్రేమించే కళాకారుడిగా నిర్మా తగా ఫలిం మేకర్గా కావలి విశ్రాంత ఉప తహశీల్దార్ సిరాజ్ మొగల్ కళాసేవారత్నం అవార్డును అందుకోవ డం జరిగింది. అనంతరం సిరాజ్మొగల్ మాట్లాడుతూ సినీహిరో సుమన్ చేతుల మీదుగా సన్మానం పొందడం చాలా సంతషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

## నాయుడు రాంప్రసాద్ను పరామర్శించిన కావలి ఎమ్మెల్యే



**కావలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి సభ్యులు నాయుడు రాంప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్సలు పొంది ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సోమవారం సిరిపురం గ్రామంలోని వారి నివాసానికి వెళ్ళి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడం జరిగింది. వైద్యులు సూచించిన విధంగా జాగ్రత్తలు పాటించాలని నాయుడు రాంప్రసాద్కు ఎమ్మెల్యే సూచించారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కావలి రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు ఆవుల రామక్రిష్ణ సోమశిల ప్రాజెక్టు మాజీ ఛైర్మెన్ కండ్లగుంట మధుబాబునాయుడు, చలంచర్ల మాజీ సర్పంచ్ చాగంటి వెంకటేశ్వర్లు, టిడిపి యువ నాయకులు గుర్రం సునీల్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాలేజీ వైద్య రంగ చరిత్రలో నూతన అధ్యాయం

**- నారాయణ మెడికల్ కాలేజీ హాస్పిటల్ ఘనత**

**- ఇండియాలో తొలి ద్విముఖ లైవ్ రిమోట్ రోటోటిక్ శస్త్ర చికిత్సలు నిర్వహణ విజయవంతం**







**నెల్లూరు, ఏప్రిల్ 27, ప్రభాతవార్త-వైద్యం** నారాయణ మెడికల్ కాలేజీ హాస్పిటల్, నెల్లూరు వైద్య రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేసింది. దేశంలోనే తొలిసారి బై డైరక్షన్ లైవ్ రిమోట్ రోబోటిక్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాలేజీ ల వైద్య రంగంలో కొత్త దిశను చూపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోనారాయణ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఈ అరుదైన సాంకేతిక వైద్య పక్రియను నారాయణ మెడికల్ కాలేజీ హాస్పిటల్, నెల్లూరు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ స్వతంత్ర హాస్పిటల్, రాజమండ్రి మధ్య ప్రత్యక్ష రిమోట్ కనెక్టివిటి ద్వారా ఏప్రిల్ 25, 26వ తేదీలలో విజయవంతంగా నిర్వహించామని ఈ పక్రియలో నెల్లూరులో ఉన్న వైద్యులు రాజమండ్రిలోని రోగికి రోబోటిక్ సర్జరీ నిర్వహించారని, అలాగే రాజమండ్రిలో ఉన్న వైద్యులు నెల్లూరులోని రోగికి సర్జరీ నిర్వహించారని, ఈ సాంకేతికత ద్వారా వైద్యుల నైపుణ్యం ప్రజలకు చేరువవుతుందని, అలాగే చిన్న కోతతో శస్త్ర చికిత్స,తక్కువ రక్తస్రావం, వేగంగా కోలుకోవడం, అత్యంత ఖచ్చితత్వం లభ్యమవుతాయని వైద్యులు తెలిపారు. అనంతరం నారాయణ హాస్పిటల్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్రావులపల్లి మాట్లాడుతూ 26 సంవత్స రాల వైద్య ప్రయాణంలో ఎన్నో ఘనతలు సాధించిన నారాయణ హాస్పిటల్ ఇప్పుడు డిజిటల్, రోబోటిక్ వైద్య సేవల్లో ముం దంజలో నిలుస్తోందని, మార్చి 8వ తేదీ 2026 లో ఈ రోటోటిక్ శస్త్ర చికిత్స లను ప్రారంభించడం జరి గిందని, ఇప్పటి వరకు 13 కేసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోటోటిక్ సర్జరీలను విజయ వంతంగా నిర్వహించడం జరిగిందని, అలాగే ల్యాపరోస్కోపి ఆపరేషన్కు ఎంత ఖర్చు అవుతుందో అంతే ఖర్చుతో రోటోటిక్ సర్జరీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన మరింత సమాచారం కొరకు 84988 49847 నంబరును సంప్రదించాలని తెలిపారు. ఈ చారిత్రాత్మక విజయానికి సహక రించిన రోబోటిక్ వైద్య బృందానికి, టెక్నికల్ టిమ్కు భాగస్వామ్య సంస్థలకు హృదయపూర్వక అభి నందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు నారా యణ మెడికల్ కాలేజీ హాస్పిటల్ ముందుంటుందని అదే తమ లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, డిపూ9్యటీ మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్కాంత్, నారాయణ రోబోటిక్ సర్జన్లు డాక్టర్ వి.మహీధర్రెడ్డి, డాక్టర్ పీఆర్ వంశీకృష్ణ, డాక్టర్ వేద మూర్తిరెడ్డి, డాక్టర్ మనోభిరామ్, డాక్టర్ రఘు శ్రీ చరణ్, మత్తు వైద్యులు డాక్టర్ కృష్ణ చైతన్య, నారాయణ హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.